క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



సాక్షి నెట్‌వర్క్ : హనుమకొండ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట, తదితర మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి బైండోవర్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. అరెస్టులను ఖండించారు. నర్సంపేట మండల పరిధిలో 21 మందిని బైండోవర్ చేసినట్టు టౌన్ సీఐ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

నియామకం



నర్సంపేట : జాతీయ బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట డివిజన్ అధికార ప్రతినిధిగా గండి లింగయ్య గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు లింగయ్యకు జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్ మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. అనంతరం లింగయ్యకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడారు. డివిజన్‌లో బీసీలను ఏకం చేసి సంఘాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం బీసీలు సంఘటితం కావాలన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు



రాయపర్తి : వరికొయ్యలను కాల్చొద్దని ఏఈఓ మనస్విని సూచించారు. మండలంలోని కొలన్‌పల్లిలో పంట పొలాల్లోని వరి గడ్డిని మంగళవారం కాల్చుతున్న దృశ్యాలను చూసి ఆమె రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ కర్బనం నశించడంతోపాటు పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వరికొయ్యలను కాల్చకుండా నేలలో కలియదున్ని సింగిల్ సూపర్ పాస్పేట్ అందిస్తే మంచి ఎరువుగా మారుతుందని చెప్పారు. పంట ఎదుగుదలకు తోడ్పడుతుందని వివరించారు. వరికొయ్యలను కాల్చినా, పర్యావరణ నష్టం కలిగించినా ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శిగా స్వామి



చెన్నారావుపేట : సీపీఎం చెన్నారావుపేట, నెక్కొండ, పర్వతగిరి ఏరియా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నమిండ్ల స్వామి, సభ్యులుగా పరికి మధుకర్, మొగులోజు శారద, పెరమాండ్ల అమరేందర్‌రెడ్డి, ఏనుగుతల నరేశ్, మొగిలి జనార్దన్‌రెడ్డి, మాదాసి యాకూబ్, జిల్లా రమేశ్, బొడ్డు రవి, లింగాల మల్లయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చింతమల రంగయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు.

నివాళి

వర్ధన్నపేట : మండలంలోని బండౌతాపురం గ్రామానికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి, సీనియర్ నాయకుడు అమృతపు గోపాల్ (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాయపురపు కుమారస్వామి, నాంపెల్లి యాకయ్య, రామిళ్ల బాబురావు, శ్రీరాముల సంపత్, సోమిరెడ్డి, పెండోట మహంత్, ప్రశాంత్, మంద అమర్, ఉల్లి యాకయ్య, దేవందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని మందపల్లికి చెందిన రైతు వరికెల గోవర్ధన్ విద్యుదాఘాతానికి గురై ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లడె మోహన్‌రావు, రఘుసాల భుజంగరావు, బరుపాటి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

పర్వతగిరి : మండలంలోని చెరువుముందుతండా, రోళ్లకల్, నారాయణపురం గ్రామాల్లోని ఆకేరు వాగుతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు భూముల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తూ అక్రమార్కులను వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుముందుతండాలో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసి ఇసుకను పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

కొందరిపైనే కేసులు

చెరువుముందుతండాలో భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. హిటాచీలు, జేసీబీలతో ఇసుకను యథేచ్ఛగా తోడుతునానరు. పదుల సంఖ్యలో జేసీబీలు నడుస్తుండగా అధికారులు మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోట్ల దాడులు నిర్వహిస్తూ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా మామూళ్లు ముట్టజెపుతున్నట్టు పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. జేసీబీలు, హిటాచీలు, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



చెరువుముందుతండాలోని ఇసుక దంపు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అయినా అక్రమార్కులు ఏమాత్రం తగ్గడం లేదు. ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతూ ఇసుకను పలు ప్రాంతాలను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా ఆకేరు వాగు అడుగంటి పోతోంది. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

\- వల్లందాస్ కుమార్, వడ్లకొండ

కేసులు నమోదు చేస్తున్నాం

ఇసుక అక్రమ రవాణా నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నాం. బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తప్పవు. మండలంలోని ఆకేరు వాగు, ఇతర ప్రాంతాల్లో ఇసుక రవాణా జరిగితే రైతులు, ప్రజలు సమాచారం అందించి సహకరించాలి. అక్రమార్కులను వదిలి పెట్టే ప్రసక్తే లేదు.

\- బోగం ప్రవీణ్, ఎస్సై, పర్వతగిరి

కొంగ రజితకు సీఎం అభినందన



వర్ధన్నపేట : సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న కొంగ రజిత

వర్ధన్నపేట : ఎంబ్రాయిడరీలో నైపుణ్యాన్ని చూసి ఇల్లంద గ్రామానికి చెందిన కొంగ రజితను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని హనుమకొండలో మంగళవారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు సీఎం హాజరయ్యారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పలు ఉత్పత్తుల స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామ మణికంఠ మహిళా పొదుపు సంఘం సభ్యురాలు ఏర్పాటు చేసుకున్న స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఎంబ్రాయిడరీ నైపుణ్యంతో సీఎం చిత్రాన్ని ఒక తెల్ల గుడ్డపై వేసి, అందంగా తయారు చేసి ఫ్రేమ్‌తో సీఎం రేవంత్‌రెడ్డికి బహుకరించింది. ఆమె నైపుణ్యాన్ని గుర్తించి రజితను అభినందించారు. తనతోపాటు మరో నలుగురికి ఉపాధి కల్పించే అవకాశం లభించిందని ఆమె వివరించారు. తాను గతంలో అందుకున్న అవార్డును సీఎంకు చూపించింది. వెంటనే సీఎం సంబంధిత అధికారిని పిలిచి హైదరాబాద్ శిల్పారామంలో స్టాల్ ఏర్పాటు కోసం రజితకు అవకాశం కల్పించాలని ఆదేశించారు.

అభిమానం చాటుకున్న భవ్య

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన విద్యార్థిని నూటెంకి భవ్య పెన్సిల్‌తో గీసిన సీఎం చిత్రపటాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందించి అభిమానం చాటుకుంది. ప్రజాపాలన విజయోత్సవ సభను పురస్కరించుకుని స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో భవ్య తాను వేసిన చిత్రాలతో స్టాల్ ఏర్పాటు చేసింది. ఆర్ట్స్ గ్యాలరీని సీఎం పరిశీలించే క్రమంలో భవ్య తాను పెన్సిల్‌తో గీసిన సీఎం ప్రొట్రేట్ చిత్రాన్ని అందించింది. దీంతో సీఎం భవ్యను అభినందించి కలిసి పోటో తీయించుకున్నారు. నూటెంకి ప్రభాకర్–జయ దంపతుల కూతురు భవ్య బీఫార్మసీ పూర్తి చేసి పొట్రేట్ ఫొటోలు, వివిధ రకాల చిత్రాలు, డిజైన్లు వేస్తోంది.

విద్యార్థినికి అవార్డు



నెక్కొండ : మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాల 4వ తరగతి విద్యార్థి నంగునూరి పూర్ణిమ కళా ప్రతిభ అవార్డు అందుకున్నట్టు స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థినిని ఆయన అభినందించి మాట్లాడారు. ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వ సంస్కృత నంది పురస్కారాలు–2024, తెలంగాణ బాలోత్సవ్–2024 పాటల పోటీల్లో పూర్ణిమ అవార్డు అందుకుందని తెలిపారు. అలాగే ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో 9వ తరగతి విద్యార్థి అభినవ్ మెరిట్ సర్టిఫికెట్ పొందాడని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షరీఫ్, డైరెక్టర్ చల్లా పారిజాతం, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో చదువుకుని అమెరికాలో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ యాదగిరిని హెచ్‌ఎం తేజావత్ జయ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఐ యాదగిరి క్రీడోత్సవాల నిర్వహణ, ఇతర మౌలిక అవసరాలకు ఏటా రూ.10 వేలు అందించనున్నట్లు ప్రకటించారని చెప్పారు. స్కూల్ అభివృద్ధికి దాతల సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు పులి దేవేందర్, వ్యవస్థాపక సభ్యులు పిన్నింటి బాలాజీరావు, చింతకింది ఇందిర, ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దేవేశ్ మిశ్రా అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. శీలం నాగరాజు స్వరూప, నిఖిల్, అఖిల్, వజ్రమ్మ, వర్షిత, నాగరాజు, ఎల్లగౌడ్, మంజుల, భానుప్రసాద్, వీరన్న, సావిత్రి, చర్ల యాకయ్య పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, నాయకులు చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మినారాయణ, రాజశేఖర్, బంగారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, వజినేపల్లి శ్రీను, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, శ్రీరాముల కార్తీక్, భరత్, కాట రఘు, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బేతం అఖిల్, గురుస్వాములు దేశీరామ్, శ్రీధర్, మర్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న అర్చకుడు, అన్నదాతలు

‘వ్యాసరచన, డ్రాయింగ్’లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలో మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో స్థానిక గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ‘పర్యావరణ పరిరక్షణ–బాలల హక్కులు’ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఫాతిమా, డ్రాయింగ్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి ఈశ్వర్‌నాయక్ ప్రతిభ చాటి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రానున్న ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం




చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో పార్టీ ఖానాపురం మండల అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ అధ్యక్షతన ఆ మండలం గొల్లగూడెంతండా నుంచి లవన్‌నాయక్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చూసి పలువురు పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, నర్సంపేట మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పాదిల్ల రాంచందర్, తవుటం రమేశ్, ఖానాపురం మండల నాయకులు రాధారపు అశోక్, సహదేవ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

‘అవిశ్వాస తీర్మానానికి సహకరించాలి’

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి సొసైటీలో నేడు తలపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరయ్యేలా సహకరించాలని డైరెక్టర్లు ఎస్సై, సీఐ, ఏసీపీ, సీపీని కోరారు. ఈ సందర్భంగా వీడియో సందేశం పంపించారు. తాము అవిశ్వాస తీర్మాణం కోరుతూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నేడు అవిశ్వాస తీర్మానం పెట్టనుండగా అడ్డుకుంటామని, తమపై దాడి చేస్తామని తెలిపిన క్రమంలో పక్క రాష్ట్రంలో క్యాంపునకు వెళ్లి నేడు రానున్నట్లు తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

‘ఎల్లూరుగుట్టపై తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు’




సంగెం : మండలంలోని ఎల్లూగర్‌గుట్టపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని మండలంలోని నర్సానగర్ గ్రామస్తులు నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉండీల రాజు, జాటోత్ వెంకన్న మాట్లాడారు. వేల సంవత్సరాల క్రితం నుంచి గుట్ట ఐకాన్‌గా ఉందన్నారు. అనేక రకాల పశు, పక్ష్యాదులకు నిలయమని చెప్పారు. ప్రాముఖ్యత, జీవవైవిధ్యం కలిగిన క్రమంలో గుట్టపై మైనింగ్ చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో గుట్ట అనవాళ్లు లేకుండా చేసే ప్రమాదం ఉందన్నారు. మైనింగ్ అనుమతితో అక్రమంగా మోరం తవ్వకాలు చేపడుతుండడంతో గుట్ట మీదున్న వృక్షాలు నేలకొరిగి ఆకృతిని కోల్పోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు జాటోత్ లింగమూర్తి, బీమ్లా నాయక్, చంద్రశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం విమర్శించారు. మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ద్వారకపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎంజేఆర్, గోపీకృష్ణ ఇండస్ట్రీలలో రొట్టె శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశాలకు మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కార్మికుల సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు క్లెయిములను సంవత్సరాలుగా పెండింగ్‌లో పెడుతోందన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రుద్రారపు ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అమలు చేసే సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో కోత విధిస్తున్నాయని తెలిపారు. సమావేశాల్లో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, నాయకులు దేవేందర్, యాకన్న, హనుమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో బాలలపై వేధింపుల నివారణ



మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట : బాలలపై వేధింపులను అవగాహనతో నివారించొచ్చని స్వయంకృషి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ తెలిపారు. ప్రపంచ బాలల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విజ్‌డమ్ స్కూల్‌లో స్వయంకృషి, ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడారు. ఆడపిల్లలు లైంగిక, ఇతర పలు రకాల వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. అపరిచితుల పట్ల ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు. వేధింపులకు గురైనట్టు భావిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్–1098, డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

సాక్షి నెట్‌వర్క్ : ప్రధానిగా దేశ ప్రజలకు ఇందిరాగాంధీ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, ఖానాపురం, నెక్కొండ, నల్లబెల్లి, తదితర మండలాల్లో ఇందిరాగాంధీ 107వ జయంతిని మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఇందిరాగాంధీ చేపట్టిన సంస్కరణలను, పేదరిక నిర్మూలన కార్యకర్తలు, తదితరాలను ఉటంకించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఇందిరాగాంధీ స్ఫూర్తితో సుపరిపాలన అందిస్తోందని తెలిపారు.



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



నెక్కొండలో..



ఖానాపురంలో..



నల్లబెల్లిలో..

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు కీలకం



సంగెం : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సురేశ్ కాంబ్లే



గీసుకొండ : పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

సంగెం : పశువుల సంరక్షణలో జాగ్రత్తలు కీలకమని పశు వైద్యుడు డాక్టర్ వంశీ స్పష్టం చేశారు. మండలంలోని రామచంద్రాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) ప్రతినిధి సురేశ్ కాంబ్లే ప్రారంభించగా ప్రముఖ పశు వైద్యుడు డాక్టర్ వంశీ మాట్లాడారు. పాడి రైతులు పశువులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. తద్వారా వ్యాధుల నివారణతోపాటు వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. 90 శాతం ఖచ్చితత్వంతో కృత్రిమ గర్భధారణ చేసి అధిక పాల దిగుబడి సామర్థ్యం కలిగిన మేలు జాతి ఆడ దూడలను పుట్టించే సాంకేతికత అందుబాటులో ఉందని తెలిపారు. పశువులు సకాలంలో ఎదకు రాకుంటే ముందస్తుగా గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయించాలని సూచించారు. సకాలంలో సూడి నిలిచే అవకాశం ఉందన్నారు. తొలుత వైద్యశిబిరంలో 72 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అందించడంతోపాటు 12 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎఫ్ చీఫ్ మేనేజర్ సురేశ్ కాంబ్లే, రాష్ట్ర ఇన్‌చార్జ్ ఇంద్రజీత్ సింగ్, ఏరియా ఇన్‌చార్జ్ పురుషోత్తం రాథియా, వంశీకృష్ణారెడ్డి, పశు వైద్యులు డాక్టర్ నరేశ్, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, సిబ్బంది శుకూర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ తండాలో..

గీసుకొండ : మండలంలోని ఎస్టీ తండాలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మాల పీవీసీ డాక్టర్ శ్రీనివాస్, జేవీఓలు రజిత, సతీశ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎంజహంగీర్, గోపాలమిత్రలు ఇస్మాయిల్, రమేశ్, అనిల్‌కుమార్, అక్బర్, మధుకర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతోనే బోధనలో ఉన్నతి

● నిట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్ బాబు

నర్సంపేట రూరల్ : సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే బోధనలో ఉన్నతి సాధించగలరని వరంగల్ నిట్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్ బాబు స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ‘ఐఓటీ అప్లికేషన్స్, సెన్సార్ నెట్‌వర్క్, థియరెటికల్ అండ్ ప్రాక్టికల్ అప్రోచ్’ అంశంపై ఏఐసీటీఈ సహకారంతో నిర్వహించిన రెండు వారాల సాంకేతిక శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫ్యాకల్టీకి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించే దిశగా ఏఐసీటీఈ సహకారంతో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఐఓటీ అప్లికేషన్లు స్మార్ట్‌సిటీలు, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమలతో సహా వివిధ రంగాల్లో కనెక్టివిటీ, సామర్థ్యాన్ని పెంచుతాయని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ సురేశ్ బాబును బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి మల్లికార్జున్‌రెడ్డి, సమన్వయకర్తలు డాక్టర్ శరవణన్, సింగం శ్రీధర్, ఏఓ సురేశ్, డీన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సురేశ్‌ను సత్కరిస్తున్న రాజేంద్రప్రసాద్

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నబాయి

గీసుకొండ : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని సంగెం మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) చిన్నబాయి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ‘లింగ ఆధారిత హింస–నివారణ, మహిళల రక్షణ చట్టాలు’పై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తోందని చెప్పారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్ష చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షార్హులవుతారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు లింగ నిర్ధారణ చట్టం అమలుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం నేరమనే విషయమై మహిళలకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్వోదయ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ మాట్లాడుతూ మహిళా సహాయక కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గీసుకొండ సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సర్వోదయ సంస్థ ప్రతినిధులు ఇందిర, అక్తర్, వాణి, తదితరులు పాల్గొన్నారు.